# MAA(మా) FUN(పం)డగ - by పార్థు



అది "చిత్రకళ" వంశం వారింట్లో 75 సంవత్సరాల తరువాత జరుగుతున్న పెద్ద పండగ. చిత్రకళ వంశం ఏన్నో కష్ట, నష్టాలను భరించి, వ్యయప్రయాసలనొరర్చి, ఈ రోజున దేశం లోనే ఒక పెద్ద వంశం గా ఆవిర్భవించింది. అందుకు ఎందరో వ్యక్తుల అనిర్వచనీయమైన కృషి వుంది. మరి అలాంటి వంశం ఘనత ని ఘనం గా జరుపుకోవాలని, ఆ వంశానికి మూల పురుషులైన పెద్దలను ఉచిత రీతిన గౌరవించాలని, ఎక్కడెక్కడో స్థిరపడిపోయిన దాయాదులు, వెలు పిడిచిన మేనమామలూ, బంధువర్గాన్నీ ఒక తాటి మీదకు తెచ్చి, ఆనాటి బంధాలూ-అనుబంధాలూ గుర్తుకు తేవాలని, ఆ వంశం లోని నేటి తరానికి చెందిన కుటుంబ సభ్యులు అనుకోవడం తో ఈ పండగ కి శ్రీకారం చుట్టడం జరిగింది.

సంక్రాంతి పండగకే కొడుకులు-కోడళ్ళూ, కూతుళ్ళూ-అల్లుళ్ళూ, మనమలూ, మనమరాళ్ళతో తెలుగు వారి లోగిళ్ళు ఎలా వుంటాయి? మరి, వంశం లో వున్న ఇన్ని కుటుంబాల కలయిక అంటే అంత సందడి తో పాటు, ఎంత హంగూ-ఎంత ఆర్భాటం వుండాలి? మరి అంతుండాలంటే, జేబు లో ఎంతుండాలి? అంతున్నా, దీనిని నెత్తికెత్తుకుని చేసే వాళ్ళు వుండలా? అలాంటి ఆలోచనలోంచి పుట్టుకొచ్చిందే ఒక నిర్వాహణ కమిటీ. కమిటీ వుండటం వరకూ OK, మరి కమిటీ లో ఎవరెవరు వుండాలి అనే దాని మీద చర్చ రేగడం తో జరగబోయే "పండగ" కి కళ వచ్చింది.

అది పేరున్న, పెద్దదైన వంశమే అయినప్పటికీ, అన్ని వంశాల లాగే అక్కడా "పెద్ద మామ గారికీ, బుల్లి పిన్నికీ పడకపోవడం", "చిన్న బావ గారికీ, చివరి కొడుక్కీ కుదరకపోవడం" లాంటివి మామూలే. "ఈ వంశానికి ఈ మాత్రం పేరైనా వచ్చిందంటే అది మా అన్న గారి వల్లే కనుక కమిటీ కి మేము సారధ్యం వహించాలని" అంటూ ఒక దాయాది తమ్ముడు, "ఆ పేరు ని నిలబెడుతున్నది మా అన్న కాబట్టి మాకు రావాలని" ఇంకో సవతి తమ్ముడూ గొడవలు పడటం తో, తల మాసిన, గడ్డాలు నెరిసిన కొంత మంది పెద్దలు కలుగజేసుకుని సంధి కుదర్చడంతో సన్నాహాలు మొదలయ్యాయి దాని తో పాటు సమస్యలూనూ.

ఏర్పాట్లు మొదలయ్యాయి. ముఖ్య అతిధులు గా పేరంటానికి ఎవర్ని పిలవాలో నిర్ణయించడం, పొరుగూరు బంధు గణం ఎడ్రస్ లు పట్టుకుని ఆహ్వానాలు పంపడం, విడిది ఏర్పాట్లు, వీడియో ఏర్పాట్లు చూడటం వగైరా. ఇక, ఊళ్ళో పిలుపులు మొదలెట్టారు. తల నిజం గా అనుభవం తో పండిపోయిన ఒక "ముసలి తాతయ్య" కి కోపం వచ్చింది, ఇంటికొచ్చి సరిగ్గా పిలవలేదు అని. ఆయన అలిగాడు. వేడుకకి నేను రాకపోవటమే కాదు, మా ఇంట్లో నౌకరు "నాగరాజు" కూడా రాడు అని భయపెట్టాడు. ఆయన వంశ చరిత్ర లో మొదటి తరం వర్గం లో ప్రముఖుడు. అసలు ఆ వంశం ఆ ఊరొచ్చి, అక్కడ అంతలా కుటుంబాలు విస్తరించాయి అంటే ఆ పెద్దాయన కూడా ఒక ముఖ్య కారణం, మరి అలాంటి కుటుంబ పెద్ద రావడం లేదంటే, పండగ పోట్టి దండగ అనుకోరూ అతిధులు? ఆగమేఘాల మీద పరిగెట్టారు కమిటీ పెద్దలు. ఈ సారి అందరూ ఆయన ఇంటి గడపల మీద, కాళ్ళ మీదా పడి, సాష్టాంగ నమస్కారాలు చేసినంత పని అయినతరువాత ఆయన శాంతించి పచ్చజెండా ఊపారు, మళ్ళీ అందరి లో ఉత్సాహం పొంగుకొచ్చింది.

ఇంత లోనే ఇంకో పిడుగు లాంటి వార్త, ఈ సారి నాన్న గారో, తాత గారో అలగలా. వారి తరపున

ఒక నాని గాడు అలిగాడు "మా నాన్నగారే మన్నా మణులు అడిగారా, మాన్యాలు అడిగారా? మనఃస్పూర్తి గా పిలవమన్నారు. ఆయన్ని పట్టించుకోలేదు కనుక, నేను రాను ఈ ఫంక్షన్ కి" అని తెగేసి చెప్పాడు. కొత్త తరం పిల్లా, జెల్లా కి ఈ నాని అంటే బాగా లైకింగ్. మళ్ళీ పరుగు మొదలైంది కమిటీ కి.

ఇంకా అలా వాళ్ళ కి సమస్యలు చాలా రూపాల్లో రావటం మొదలయ్యాయి,

"నా సెల్ కి కాల్ చెయ్యలేదు, లాండ్ లైన్ కి చేసి చెప్పారని" కాకినాడ బాబాయి,
"RAC టికెట్స్ ఇచ్చారు, బెర్త్ లు కన్ ఫర్మ్ అవ్వలేదు" అంటూ అనకాపల్లి అబ్బాయి
"స్టేషన్ కి కార్ పంపిస్తాం అన్నారు, ఆటో తో సరిపెట్టారు" అని పిఠాపురం పిన్ని,
"A/C గదులు ఇవ్వకపోగా, కనీసం మడత మంచాలు కూడా సరిగ్గా లేని పిడిది ఏర్పాటు చేసారు" అని అమలాపురం అక్కయ్య...

మొత్తానికి పండగ 3 రోజులు కోసం దిగిపోయారు తమ తమ కుటుంబాలతో.

ఇక అసలు సండడి మొదలైంది.

వీడియో కవరేజ్ వాళ్ళు కుటుంబ సభ్యులని ఉక్కిరి బిక్కిరి చేసారు ప్రశ్నలతో.

"మరి చాలా రోజుల తరువాత మీ చిన తాతయ్య గారిని చూసారు కదా, అప్పటికీ, ఇప్పటికీ ఏమిటీ ఆయనలో తేడా దగ్గటం తప్ప"?

"మా రోజుల్లో అయితే, పెద్ద వాళ్ళు కూర్చీలలో కూర్చుంటే, పిల్లలం కింద కూర్చునే వాళ్ళం ఫొటోలు దిగుతుంటే, ఇందాక ఎవడో భడవా, నా భుజం మీద చెయ్యి వేసి తీయించుకున్నాడు ఫొటో" అంటూ బోసి నవ్వు తాతగారు

"అప్పట్లో పిలుపులు ఇలా వుండేవి కావమ్మా, దుప్పట్లో వున్నా సరే లేపి మరీ పిలిచేవాళ్ళం, పిదపకాలం, పిదప బుద్ధులూనూ, అదేదో "ఎస్సో, తుస్సో, యస్సెమ్మెస్సో నంట" దాంలో పంపిస్తే, ఈయన రెడీ అయిపోయారు పవుడర్ రాసేసుకుని, నేనైతే రాకపోదును, ఏదో మా "నిర్మలక్కయ్య" ని చూసి చాన్నాళ్ళయింది కాబట్టి వచ్చా"

"కాంతయ్య తాతయ్య గురించి వినడమే కానీ, ఎప్పుడూ చూడలా. కత్తిలా ఉండేవారట, ఇలా చూడటం బాధ గానే వున్నా, ఇప్పటికి కలవటం చాలా ఆనందం గా వుంది."

"శోభనారావు బావ కూడా వచ్చుంటే బావుండేది, ఎంత దూరంగా వున్నా ఆయిన వాళ్ళను మర్చిపోతామా? ఎంత కాదనుకున్నా చుట్టాలం కాకుండా పోతామా?" నశిగింది శారదక్కయ్య.

"ఆర్థికంగా చితికిపోయిన చుట్టాలు చాలా మందికి పిలుపులు వెళ్ళలేదు, వేల కు వేలు పెట్టుకుని రాగలిగే స్థోమత లేని చుట్టాలను చిన్నచూపు చూసినట్టు అయింది" వాపోయాడు హరి మామయ్య

"Technique డామినేట్ చేస్తుంది, కల్చర్ మిస్ అవుతుంది ఈ రోజు ఫేమిలీ లలో, మార్పు సహజం, మా లాంటి వాళ్ళం సర్దుకుపోవల్సిందే" అంటూ కామెంట్స్ తో జోరుగు గ మొదలయ్యాయి మొదటి రోజు సంబరాలు.

మొదటి రోజు:
----------------

కుటుంబ పెద్దలను సత్కరించాలి అని నిర్ణయించారు. సత్కారం, ఉపన్యాసం అంటే వుత్సాహం వుండదు బొత్తిగా అని, పిల్లా, జెల్లా తో వినోద కార్యక్రమాలు పెట్టించారు, ఆ వంశం లో కళాకారులకి కొదవ లేదు కనుక.

మొదటి రోజు ముఖ్య అతిధి గా విచ్చేసిన ఆ రాష్ట్రం లోని ప్రముఖ వ్యక్తి కి, వీళ్ళ కుటుంబ ఘోష తెలియదు, మాట్లడుకునే బాష అంత కన్నా రాదు. ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి విదేశీ బాష లో, "నేను చాలా విన్నాను వీళ్ళ వంశం గురించి, ఎవరు చెప్పారు వ్యవసాయం దేశానికి వెన్నెముక అని, ఇలాంటి వంశాలే దేశ ఆర్ధిక వ్యవస్థ ని పటిష్టం చేసేది.." అంటూ మాట్లాడాడు.

సన్మానం అందుకున్న ఆ కుటుంబ పెద్ద మైక్ అందుకున్నాడు. ఇక ఆయన తనదైన శైలి లో "అసలు ఈ వంశం ఎలా పుట్టింది, తల్లి ఎక్కడ నుండి వచ్చింది, తండ్రి ఎక్కడ నుండి వచ్చాడు, ఎన్ని ప్రసూతి కాన్పులు అయ్యాయి, తల్లి కి మనం ఏం చేస్తున్నాం, పక్కన చెల్లెళ్ళు ఎవరు 75 ఏళ్ళు అయినా పట్టించుకోలేదు, మనం మర్చిపోలేదు చాలా ఆనందం గా వుంది, చెప్పుకోకూడదు కానీ సవతులతో ఉన్నప్పుడు తల్లి కి bypass surgery చేయించి ఇక్కడ కు తీసుకొచ్చింది నేనే. నాతో గేమ్స్ ఆడాలనుకుంటే మీరు రావలిసిందే అనడం తో నన్ను నమ్మకుని ఇంకొంత మంది వచ్చారు, అలా తల్లి ఈ గల్లి చేరింది. తల్లి కి నేను అలా ఒక గుర్తింపు తెస్తే, రామయ్య అన్నయ్య డిల్లీ దాకా డేకించి ఆ ఖ్యాతి విస్తరింపచేసాడు, కనుక మేమిద్దరం రెండు కళ్ళు లాంటి వాళ్ళం. మా కళ్ళ ముందే ఎన్నో eye bank లు పుట్టుకొచ్చినప్పటికీ ఈ వంశం పేరు వినిపించినంత కాలం, తల్లి మా కళ్ళ తోనే చూస్తుంది." అంటూ emotional గా చెప్పడం తో ఆ తరం వారంతా అప్పటి మధురానుభూతులను గుర్తు చేసుకుని ఆనందబాష్పాలు కార్చారు.

ఈ లోపు ఈ తతంగాన్ని నిర్వహిస్తున్న ఒక పెద్ద లేచి, "ఇప్పటి వరకూ కళ్ళ కి జరిగిన సన్మానం చూసారు, ఇప్పుడు ముక్కు, చేవులకు కూడా జరపబోతున్నామని" అంటూ ముక్కాడు.

ఈ విరామం లో సవతి సోదరులు అంబరీష్ అన్నయ్య, రజనికాంతం మామయ్య లాంటి కొంత మంది ఈ వంశం ఎంత గొప్పదో చెప్పడానికి వచ్చారు, వచ్చీ రాని బాష లో. "పురాణాలలో పురుషులు ఎలా వుంటారు అని ఎవరైనా అడిగితే, ఈ వంశం లో పాత తరం వాళ్ళని చూపితే చాలు" అంటూ వంశాన్ని పొగుడుకొచ్చారు. అది వొట్టి మాట కాదు, గట్టి మాటే అని నిరూపించడానికి అప్పటికప్పుడు ఈ తరానికి చెందిన వారసులు ఒక చిన్న ప్రదర్శన ఇచ్చి "భళీ" అనిపించారు.

తర్వాత మరికొన్ని సన్మానాలు, కొన్ని అవమానాలు జరిగాయి.

ముగింపు వేడుకలలో, పాత తరాల కి గుర్తు గా, భావి తరాలకి బహుమతి గా, నేటి తరం అంతా

కలసి, "మేము అంతా కలసికట్టు గా వున్నాం, వుంటాం" అని అందరి కీ చెప్పడానికి ఒక "గ్రూప్ ఫొటో" తీయించి ఇద్దమనుకున్నారు. తీస్తున్నప్పుడు పకపకలు వినిపించినా, తర్వాత లుకలుకలు వినిపించాయి. "నన్ను రెండో వరుస లో నుంచో పెట్టారని" ఒకరు, "నన్ను వొంగోపెట్టారు" అని ఇంకొకరు కోపాలొచ్చి ఇంట్లోంచి విస విసా వెళ్ళిపోయారు.

రెండవ రోజు:
-----------------

మళ్ళీ సన్మానాలు మొదలయ్యాయి. ఈ సారి మొదటి తరం తర్వాత తరం వాళ్ళలో పెద్ద వాళ్ళని, గొప్ప వాళ్ళనీ సత్కరించదలచారు. సాహసికుడు, మంచి వ్యక్తి గా పేరున్న, శివరామకృష్ణయ్య బాబాయ్ ని సత్కరించడం అందరినీ ఆనంద పరిచింది. ఇక ఆయన మైక్ అందుకుని చెప్పుకొచ్చాడు తను వంశానికి ఏమి చేసినది. "నా వల్ల ఇబ్బందులు పడ్డ వాళ్ళని నేనే ఆదుకున్నాను", "పాడి పంటలు, పిడక మంటలు లాంటివి చేసుకుంటూ ఇంట్లో వాళ్ళు కష్టపడుతుంటే నేనే cowboys ని తెప్పించాను", "తప్పదు అనుకుంటే, Thar ఎడారి కైనా ఫేమిలీ ని తీసుకెళ్ళి, తీసుకొచ్చిన ఘనత నాదే", "ఒంటి మీద కప్పే 35mm గుడ్డలు సరిపోక తల్లి పడే అవస్థ చూసి, 70mm తాను లు కొనుక్కు తెచ్చింది నేనే" అంటూ ఆయన తను వంశానికి చేసినది మననం చేసుకున్నాడు.

ఈ లోపు శివారెడ్డి అన్నయ్య వొచ్చి, ఈ తాతయ్యలు, మామయ్యలూ, బాబాయ్ లూ, అన్నయ్య లూ ఎలాంటి "చేష్టలు" చేస్తుండే వారో ఆ రోజుల్లో mimic చేసి చూపించడం తో అందరూ మనసారా నవ్వుకున్నారు.

మూడవ రోజు:
-----------------

ఈ రోజు కూడా ఆరంభం అదిరింది. సంబరాలు అంబరాన్ని తాకుతున్న వేళ. ఆందరి లోనూ 2 రోజులు తాలుకు అనుభూతుల తో మది నిండుకున్నప్పటికీ, ఇవాల్టితో ఆ ముచ్చట ముగుస్తోంది అని బాధ కూడా లేకపోలేదు.

ఇక ఆ రోజు సన్మానాల లిస్ట్ లో నేటి తరానికి చెందిన "పేరుగాంచిన" కుటుంబ సభ్యులకి. ముందుగా పీరాంజనేయులు అన్నయ్య కి జరిపారు, పట్టు బట్టలు, బంగారపు వుంగరం పెట్టి. ఇక ఆంజనేయులు అన్నయ్య లేచి సిలబడి చెప్ప"సాగాడు". "ఇలాంటి సభలు, సన్మానాలు నాకు కొత్త కాదు, కానీ దీన్ని ఎంతో అపురూపమైనది గా భావిస్తున్నా, ఎందుకంటే చిన్న వాడిని అయినప్పటికీ, నన్ను కూడా ఒక అగ్రగణ్యుడు హోదా లో పెద్దల సరసన చేర్చి సత్కరించడం జీవితం లో మర్చిపోలేను. నేను వృత్తి రీత్యా రాక్షసుడి లా, కిరాతకుడి లా, గూండా లా ప్రవర్తించినప్పటికీ, అదంతా ఈ తల్లి కి పేరు తీసుకురావడానికే. అందుకే విజేత గా నిలచాను. మీ వంశం ఎప్పటికీ కోట్లు సంపాదించలేదని చిన్న చూపు చూసిన సవతి సోదరులకి, ఎంతో "ఘరానా" గా చేసి చూపించి, మన వంశ చరిత్ర గురించి ఇండియా అంతా ఒకరోజు మాటలడుకునే కవర్ పేజ్ కి ఎక్కించి వాళ్ళ అహం అణిచిన "మొగుడ్ని". అలాగే సమాజ సేవలోనూ. అయినా నన్ను పెద్ద వాడిని

చెయ్యకండి, నేను ఎంత ఎదిగినా ఎప్పటికీ 5 ft 5 inches మాత్రమే వుంటా." అంటూ సాగిపోయింది ఆయన ధోరణి.

ఆంజనేయులు అన్నయ్య స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి, వంశానికి వున్న ఖ్యాతిని నిలబెడుతున్న వాళ్ళలో తను ఒకడు. కాకపోతే, ఎటొచ్చీ, వంశానికి మూలపురుషులతో సమానంగా చూడటం కొంత జీర్ణించుకోలేని కినుకు వుంది. కొన్ని పరిమితులు విధించుకోవడం, గిరిగీసుకుని కూర్చున్నట్టుగా అక్కడే వుండిపోవడంతో, వంశానికి కొన్ని పనులే చెయ్యగలిగాడు కానీ, మూలపురుషుల్లా "ఆమూలాగ్రం" అందులో రాణించలేకపోయాడు. కుటుంబంలో చాలా మందికి ఇది కొరుకుడు పడకపోయినా కిమ్మనకుండా కూర్చున్నారు.

తర్వాత, ఆ రోజు ముఖ్య అతిధిగా పిచ్చేసిన పెద్దాయన అలవాటులో పొరపాటుగా "అధ్యక్షా!" అంటూ మొదలుపెట్టే సరికి, నిర్వాహకులు "అయ్యా! దీనికి మీరే అధ్యక్షులు" అనడం అతిధుల ఆహ్లాదాన్ని కలిగించింది.

ఇక తర్వాత ఒక సవతి తమ్ముడికి చేద్దామని మోహన్ రావు అన్నయ్యని పిలిచారు. ఈ అన్నయ్యకి కుటుంబంలో ఒకరకమైన పేరు వుంది. ఎక్కడ వుంటే అక్కడ గొడవలు రేపుతాడని. పైగా ఆధిపత్య పోరులో అందరికన్నా ముందు వుంటాడు. చకచకా రావడం, పిసపిసా వెళ్ళిపోవడం కూడా అయిపోయింది సన్మానం వద్దంటూనే.

చిన్నపాటి కలకలం. కుటుంబ సభ్యులలో ఆందోళన. ఎందుకు తిరస్కరించాడు, ఏంటట అతగాడి కోరికలు.. ఇలా సాగిపోయాయి అతిధుల ఆలోచనలు.

మైక్ ముందుకు వచ్చాడు, చిన్నగా దగ్గి చెప్పసాగాడు "నేను మొదటి నుండీ ప్రశ్నిస్తూనే వస్తున్నాను, ఎవరు చెప్పారు ఇలా చేస్తేనే వంశానికి పేరు తెచ్చేది అని. ఏం నేను తెచ్చింది పేరు కాదా? నేనూ స్వయం కృషితోనే ఎదిగాను, నేనూ కోట్లు కుమ్మరించి కుటుంబానికి, తల్లికీ సేవలు చేసాను. మరి నాకెందుకు ఈ సిల్కు చొక్కా, గళ్ళ లుంగీ ఇచ్చారు, వారికెందుకు పట్టు పంచెలు, పట్టు కండువాలు? తప్పదు అనుకుంటే అన్నని తన్నిన వాడినే, గీడదు అనుకుంటే ఆడపడుచునైనా సరే, అల్లరి పెట్టిన వాడినే, మరి వాళ్ళకెందుకు బంగారు కడియాలు, నాకెందుకు ఈ సొట్ట పడ్డ వెండి మరచెంబులు, చెప్పండి. మా గిరి మామయ్యకి కుర్చీ వెయ్యలేదు, వారి తమ్ముడ్ని వాకిట్లోనే ఆపారు, ఎందుకీ పక్షపాతం, ఎందుకిలా విభజించి పాలిస్తున్నారు అని అడగటమేనా నేను చేసిన తప్పు అని ఆవేశంగా ప్రశ్నిస్తుండగా చంద్ర పాల్ మామయ్య లేచి "అదీ అలా అడుగు" అంటూ సమర్ధించడం, పక్కనే వున్న వీరాంజనేయులు తమ్ముడు లేచి వేలుతో వార్నింగ్ లు ఇవ్వడంతో కుటుంబ పెద్దలు, పిన్నలూ, అతిధులు అల్లాడిపోయారు. "ఇలాంటి కంటి తుడుపు సన్మానాలు నాకొద్దు, ఈ వంశానికే పెద్ద దిక్కు అయిన పెద్ద అన్నయ్య నన్ను డిల్లీ పంపారు, ప్రజా నాయకుడిని చేసారు, ఇంకో అన్నయ్య ఆశీస్సులతో గొప్ప గొప్ప పనులు చేసాను, ఇంత కు మించి, అన్నయ్య చేత "రకరకాల" వేషాలు వేయించి ఫొటోలు తీయించాను, ఆ తృప్తి ముందు ఇదెంతా?" అంటూ దిగిపోయాడు.

సభ కాస్త సద్దుమణిగాక, వరుసలో వున్న ఇంకో వారసుడిని, బాలకృష్ణారావు బాబాయిని సన్మానిస్తాం రమ్మన్నారు, "ఈ సారి category లు ఏపీ లేవు ఉత్తుత్తి విభాగంలోనే" అన్నారు.

భయపడుతూనే బయలదేరాడు బాబాయి. తీసుకుంటే ఏమవుంతుందో, తీసుకోపోతే ఏమవుతుందో తెలియని అయోమయ పరిస్థితులలో తీసుకోవల్సి వచ్చింది. ఏమనుకున్నాడో ఏమో, కొన్ని పద్యాలు పాడేసి, పెద్దలని పొగిడేసి, "నేను ఇంకా తల్లికి చేసినది ఏమీ లేదు, వంశం పేరు నిలపడానికి కృషి మాత్రం చేస్తున్నాను, ఇంక నాకు పంచెలూ, కండువాలు వేసుకునే వయసు రాలేదు, వచ్చినప్పుడు తీసుకుంటాను ఈ బట్టలు అంటూ అవి వదిలేసి దిగిపోయాడు.

నాగరాజు మమయ్య, ఈ మాత్రం తతంగం కూడా ఎందుకు అనుకున్నాడేమో "నేను డాన్, నేను డాన్, సారీ, నేను రాను, నేను రాను" అని ముందే నిర్వాహకులకి చెప్పేసినట్టు తోచింది expect చేస్తున్న చాలా మంది అతిధులకి.

ఇక, అప్పటి దాకా వూరుకున్న, వీరాంజనేయులు అన్నయ్య మళ్ళీ పరిగెత్తుకు వెళ్ళి మైక్ లాక్కున్నాడు. "సరైన బట్టలు పెట్టలేదు అని భార్య భర్త ని కొట్టే కల్చరా మనది? అరే!, బట్టలు నచ్చకపోతే, చిన్న గా చెప్పుకోవాలి, సరి అయిన సైజ్ వో, బ్రాండ్ వో పెడతారు కదా, అంత మాత్రాన నలుగురి ముందూ నానా యాగీ చెయ్యాలా? ఫలానా బట్టలే పెట్టమని నేను మాత్రం చెప్పానా ఏమిటి? అసలు 25 ఏళ్ళ క్రితం మా ఇద్దరికీ వంటి మీద నూలుపోగు కూడ లేని పరిస్థితి. ఎలాంటి పరిస్థితులలో వచ్చాం? ఈ రోజు బీరువాల్లో ఇన్నేసి బట్టలున్నాయి కదా అని ఇచ్చిన బట్టలని చులకన గా చూడకూడదు. నా వరకూ నేను వంటి మీద బట్టలు లేని అలాంటి రోజులుని గుర్తు చేసుకుంటూనే వుంటాను, అప్పుడే నేను సాధించిన విజయం, వంశానికి చెయ్యాల్సిన బాధ్యత లు గుర్తుకు వస్తాయి. "సరే! ఇప్పుడు చెపుతున్నాను, ఈ బట్టల్ని ఇలానే వుంచి, ఇంకో 25 ఏళ్ళ తరువాత, ఎంత కంపు కొడుతున్నా సరే, మీరు మనఃస్ఫూర్తి గా, అవును ఈ అన్నయ్య అర్హుడు అని ఇస్తేనే తీసుకుంటాను, తీసి వేసుకుంటాను, అప్పటి వరకూ నేనేంటో, నా సత్తా ఏంటో చూపించడానికి ఎప్పుడూ రెడీ గా వుంటా" అంటూ పట్టు బట్టలూ, బంగారు కడియం బుట్ట లో పెట్టి వెళ్ళిపోయాడు ఆవేశం గా.

ఒక్క క్షణం నిశబ్దం. అందరి మొహాలూ వెల వెల పోయాయి, మనసు మూలిగింది, ఎంతో సౌమ్యంగా వుండే, వీరాజనేయులు అన్నయ్య అనదరి ముందూ నిప్పులు చెరగడం, కంట తడిపెట్టడం వంటివి ఊహించని కుటుంబ సభ్యులు కదిలిపోయారు. నిర్వాహకుల మొహం లో నెత్తుటి చుక్క లేదు. కాసేపు తర్జన, భర్జన పడ్డాక, ఒక పెద్ద పైకి వచ్చి "జరిగినది అంతా ఒక పీడ కల అని, ఇంత వైభవం గా జరిగిన వేడుక కి దిష్టి తీసే ప్రయత్నం లాంటిది అని అంటూనే "అసలు బట్టల దగ్గర కొట్టుకోవడమేమిటి? నాకేమన్నా పెట్టారా, వెంకటేశ్వరరావు బాబాయి కి, నిర్మలక్కయ్య కీ, రమణ-బాబు కీ, లాంటి వాళ్ళ కి పెట్టారా? వాళ్ళు మాత్రం పెద్ద వాళ్ళు, మూల పురుషులూ కాకుండాపోతారా?

"మాకు ఆ బట్టలే పెట్టండి అని వాళ్ళేమన్నా అడిగారా, ఏ బట్టలు పెడితే అవి తీసుకోలేదూ". "బట్టలదేముంది ఇవాళ వుంటాయి, రేపు చిరిగిపోతాయి, బంధాలు ముఖ్యం కానీ. అయినా ఒక వ్యక్తి గొప్పదనాన్ని చాటి చెప్పేవి వేసిన బట్టలో, విడిచిన బూట్లో కాదు, అతని క్రమశిక్షణ- శిష్టరక్షణ నైజం. అసలు, రామయ్య అన్న కి ఏం బట్టలు పెట్టారని డిల్లీ వెళ్ళికి వెళ్ళినప్పుడు, అంత మాత్రాన గొప్పవాడు కాకుండా పోతాడా మన వంశం లో? ఎవరు పెడతారు పిలిచి బట్టలు, ఎవరికి కావల్సిన బట్టలు వాళ్ళు కొనుక్కోవటమే. కొంత మంది ధనలక్ష్మి శారీ ఎంపోరియుం లో కొనుక్కుంటారు, కొంత మంది కోటగుమ్మం సెంటర్ లో కొనుక్కుంటారు, నీకు నచ్చితే వెళ్ళి

చందన లో కొనుక్కో, ఎవడు కాదన్నాడు? ఇది మంచి పద్ధతి కాదు, ఇలాంటివి తల్లి సహించదు, ఆవిడ దృష్టి లో పిల్లలందరికీ వంటి మీద బట్టలు వుండాల్సిందే, పిడిచిన బట్టలైనా సరే అవి కట్టుకోవాల్సిందే, ఆవిడ దృష్టి లో అందరూ సమానమే అయినప్పటికీ, ఎన్ని పట్టు బట్టలు ఆవిడ మాత్రం కొంటుంది, ఏ బట్టలిస్తే అవి వేసుకోవాలి " అంటూ సాగి పోయింది ఆయన ధోరణి.

ఇక అక్కడ ఎవడి కీ వుండ బుద్ధి కాలా, తమ తమ బట్టలు సర్దుకుని, భర్తలని పట్టుకుని, వాహనాల వైపు పరుగులు తీసారు.

ఓ గంట గడిచిన తరువాత, 3 రోజులనుండి మట్టి కొట్టుకు పోయిన ప్రాంగణాన్ని వూడుస్తున్న పనివాళ్ళ కి దూరం గా FM రేడియో లోంచి సన్నగా వినిపిస్తోంది ..

"తెలుగు జాతి మనది, నిండుగ వెలుగు జాతి మనది..." అంటూ సమైక్యత పాట, ఘంటసాల నోట.

---

మీ సూచనలూ, అభిప్రాయాలూ రచయిత పార్థు కి తెలియచేయండి.